


# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం । 16 । అక్టోబర్ । 2026 పేజీలు: 8


# ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయం

- భూమి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.
- ఆయిల్పామ్, టమోటా తోటలను పరిశీలించిన కలెక్టర్.
- వరితో పోలిస్తే ప్రత్యామ్నాయ పంటలతో మెరుగైన ఆదాయం.



కామారెడ్డి, అక్టోబరు 15(మనం న్యూస్): సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. గురువారం జిల్లాలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్పామ్, టమోటా తోటలను ఆయన సందర్శించి పంటల సాగు విధానం, దిగుబడులు, ఆదాయ వివరాలను తెలుసుకున్నారు.

2



### భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు..

## బతుకమ్మ సంబరాలు

- లలిత త్రిపురసుందరి దేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు.
- దేవి హోమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.

3

## లాలన వృద్ధాశ్రమంలో పోలీస్ కమిషనర్

పి. సాయి చైతన్య

60 మంది వృద్ధులకు దుస్తుల పంపిణీ..

స్వయంగా భోజనం వడ్డించిన సీపీ

వృద్ధులకు ప్రేమ, ఆప్యాయత, గౌరవం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత

2





### విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం..

## నిందితుడు అరెస్ట్

పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు

కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించిన జక్రాన్పల్లి పోలీసులు

2

# లాలన వృద్ధాశ్రమంలో పోలీస్ కమిషనర్

**పి. సాయి చైతన్య**

**60 మంది వృద్ధులకు దుస్తుల పంపిణీ..**

**స్వయంగా భోజనం వడ్డించిన సీపీ**

**వృద్ధులకు ప్రేమ, ఆప్యాయత, గౌరవం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత**

ఆర్మూర్,అక్టోబర్ 15 మనం న్యూస్): ఆర్మూర్ వృద్ధుల పట్ల మానవత్వం, ఆప్యాయత, సామాజిక బాధ్యతను చాటుతూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ గురువారం ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని లాలన వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ నివసిస్తున్న సుమారు 60 మంది వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా వృద్ధులందరికీ దుస్తులు పంపిణీ చేసిన పోలీస్ కమిషనర్, స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ కొంత సమయం గడిపారు. తమ వద్దకు వచ్చి పలకరించి, దుస్తులు అందించి, భోజనం వడ్డించడంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు.

**వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి**

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వృద్ధుల జీవిత అనుభవాలను గౌరవించాలని, వారి అవసరాలను గుర్తించి తగిన సహకారం అందించాలని సూచించారు. వృద్ధాప్యంలో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారికి కుటుంబ సభ్యులు, బంధువులు, సమాజం నుంచి ప్రేమ, ఆప్యాయత, గౌరవం ఎంతో అవసరమన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా వారి సమస్యలను ఓపికగా విని, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. అవసరంలో ఉన్నవారికి సహాయం చేస్తూ మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.








**ప్రముఖ వైద్యులతో వైద్య పరీక్షలు**

కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ వైద్యులు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ గురు నాయుడు, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, భీంగల్ సీఐ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ ఎస్హెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి, వైద్యులు డాక్టర్ శంకర్, డాక్టర్ మధుశేఖర్, డాక్టర్ వంశీ, డాక్టర్ ముత్యంరెడ్డి, డాక్టర్ లింగారెడ్డి, డాక్టర్ ధనపాల్ సదన్, వృద్ధాశ్రమ నిర్వాహకులు సునీత, నాగమణి, దామోదర్ రెడ్డి, సంకీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం.. నిందితుడు అరెస్ట్

**పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు**

**కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించిన జక్రాన్పల్లి పోలీసులు**




నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉమ్మెడి అంజయ్య అలియాస్ అనిల్ను జక్రాన్పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం గురువారం ఆర్మూర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్కు తరలించారు.

**అజ్బజాన్లో ఉద్యోగం పేరుతో రూ.2.80 లక్షలు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్పల్లి గ్రామానికి చెందిన ఆకుల మహేష్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అజ్బజాన్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, ఫిర్యాదుదారుడి నుంచి ఫోన్పే ద్వారా, నగదు రూపంలో మొత్తం రూ.2,80,000 వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ వీసా ఇప్పించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

**మరో ఐదుగురి నుంచి కూడా డబ్బుల వసూలు?**

ఇదే తరహాలో మరో ఐదుగురికి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, ఒక్కొక్కరి నుంచి రూ.2,80,000 చొప్పున వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఏజెంట్లు ఇచ్చే హామీలను గుడ్డిగా నమ్మి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఏజెంట్ రిజిస్ట్రేషన్, ఉద్యోగ సంస్థ వివరాలు, వీసా పత్రాలను సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని తెలిపారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని జక్రాన్పల్లి సబ్ఇన్స్పెక్టర్ జి. మహేష్ సూచించారు.

---

# ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయం

**- భూమి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**

**- ఆయిల్పామ్, టమోటా తోటలను పరిశీలించిన కలెక్టర్.**

**- వరితో పోలిస్తే ప్రత్యామ్నాయ పంటలతో మెరుగైన ఆదాయం.**



కామారెడ్డి, అక్టోబరు 15(మనం న్యూస్): సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. గురువారం జిల్లాలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్పామ్, టమోటా తోటలను ఆయన సందర్శించి పంటల సాగు విధానం, దిగుబడులు, ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. మొదట రైతు అర్జున్రావు సాగు చేస్తున్న ఆయిల్పామ్ తోటను పరిశీలించారు. సంప్రదాయ వరి సాగుతో పోలిస్తే ఆయిల్పామ్ ద్వారా మెరుగైన ఆదాయం పొందుతున్నానని, ఈ పంట సాగుపై సంతృప్తిగా ఉన్నానని రైతు కలెక్టర్కు వివరించారు. అనంతరం శివాయిపల్లి గ్రామంలో రైతు గురువారెడ్డి సాగు చేస్తున్న టమోటా తోటను సందర్శించారు. టమోటా సాగుతో వరి కంటే అధిక ఆదాయం లభిస్తోందని, ప్రత్యామ్నాయ పంటలు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని రైతు పేర్కొన్నారు.

**నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం, సాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రానున్న యాసంగి సీజన్లో ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించాలని సూచించారు. నీటి లభ్యతకు మించి పంటల సాగు చేపట్టకుండా, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి జ్యోతి, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, హిందుస్థాన్ యూనిలీవర్ సంస్థ ప్రతినిధులు చంద్రబాబు, శ్రీనివాస్, ఆయిల్పామ్ సిబ్బంది హిమకుమార్, అరుణ్, మురళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు..

# బతుకమ్మ సంబరాలు





**- లలిత త్రిపురసుందరి దేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు.**

**- దేవి హోమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**

కామారెడ్డి, అక్టోబరు 15(మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వైద్యనాథ్ కాలనీలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారిని శ్రీ లలిత త్రిపురసుందరి దేవి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన దేవి హోమంలోనూ చైర్పర్సన్ పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, కామారెడ్డి పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

మరోవైపు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని, ప్రకృతి ఆరాధనతో పాటు మహిళల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని ఆమె అన్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ పండుగలను కలిసికట్టుగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో వైస్ చైర్పర్సన్ కాసార్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులూగా రేవన్



మద్నూర్:(అక్టోబర్-15 )మనం-న్యూస్:మద్నూర్ మండలనికి చెందిన రేవన్ కామారెడ్డి జిల్లా దళిత మోర్చా అద్యక్షులు గా నూతనంగా నియమితులయ్యారు . కామారెడ్డి జిల్లా బీజేపీ అద్యక్షులు నీలం చిన్న రాజులు , కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణ రెడ్డి ఆదేశానుసారం కామారెడ్డి నూతన దళిత మోర్చ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా మోర్చా అధ్యక్షులు రేవన్ నూతన కార్యవర్గం పార్టీ సిద్దాంతలకు లోబడి పని చేస్తు ,దళితుల సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేయాలన్నారు .రాజకీయ చైతన్యం పెంచడాం తో పాటు ,ప్రజా క్షేత్రంలో ముందుకు సాగేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.జుక్కల్ నియోజక వర్గం ఎస్ సి రిజర్వేషన్ కావడంతో , వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ గడ్డ పై బీజేపీ జెండా ఎగుర వెయలని పెర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి అభిషేకం, హోమం

**పెద్దవాల్గోట్లో ఘనంగా కుంకుమార్చన..**

**భక్తులకు అన్నదాన కార్యక్రమం**



నిజామాబాద్ రూరల్ , అక్టోబర్ 15 (మనం న్యూస్): సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంజి గణేష్ మండలి ఆధ్వర్యంలో దుర్గాదేవి అభిషేకం, హోమం, కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

పురోహితులు కులకర్ణి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమం, కుంకుమార్చన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు, అంజి గణేష్ మండలి సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాలు భక్తిప్రపత్తులతో కొనసాగడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.




# కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కళ్యాణలక్ష్మి కింద రూ.1.16 లక్షలు..**

**సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.18,500 అందజేత**

నాగిరెడ్డిపేట్ అక్టోబర్ 15 ( మనం న్యూస్ ): ఎల్లారెడ్డి పట్టణంలో పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. ఇందులో భాగంగా మెల్లకుంట తండాకు చెందిన అంగోత్ బుజ్జికి రూ.1,16,000 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కును, అంగోత్ శాంతాకు రూ.18,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, మెల్లకుంట తండా గ్రామ అధ్యక్షుడు రామావత్ వాసురం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్ర వసురాం, కాంగ్రెస్ నాయకులు వర్జా నాయక్, అంగోత్ రమేష్, లకావత్ వాసురం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

**13 సబ్జెక్టుల ఫలితాలను ప్రకటించిన వీసీ ఆచార్య టి. యాదగిరి రావు**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2024 బ్యాచ్ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరి రావు గురువారం విడుదల చేశారు. మొత్తం 13 సబ్జెక్టులకు సంబంధించిన ఫలితాలను ఆయన ప్రకటించారు.

ఈ సందర్భంగా వీసీ ఆచార్య టి. యాదగిరి రావు మాట్లాడుతూ.. విద్యార్థులు సాధించిన విజయాలు చదువు పట్ల వారికున్న క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఫలితాలు విడుదలైన సబ్జెక్టులు ఇవే..**

ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. అప్లైడ్ ఎకనామిక్స్ (ఐదేళ్ల కోర్సు), ఎం.ఏ. ఎకనామిక్స్ (రెండేళ్ల కోర్సు), ఎం.ఏ. హిందీ, ఎం.ఏ. మాస్ కమ్యూనికేషన్, ఎం.ఏ. ఉర్దూ, ఎం.ఎస్సీ బాటనీ, ఎం.ఎస్సీ ఫిజిక్స్, ఎం.ఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎం.ఎస్సీ ఫిజిక్స్ విత్ ఎలక్ట్రానిక్స్, ఎం.ఎస్సీ కెమిస్ట్రీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ - రెండేళ్ల కోర్సు), ఎం.ఎస్సీ కెమిస్ట్రీ (ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ - రెండేళ్ల కోర్సు), ఎం.ఎస్సీ కెమిస్ట్రీ (ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ - ఐదేళ్ల కోర్సు) సబ్జెక్టుల ఫలితాలను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

మిగిలిన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షల ఫలితాలను త్వరలో విడుదల చేయనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె. సంపత్ కుమార్ తెలిపారు.

# దేవి నవరాత్రుల సందర్భంగా ఆర్మూర్ పిరమిడ్‌లో ధ్యానం





బోధన్ అక్టోబర్ 15 ( మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా ఆర్మోర్ లో సుప్రసిద్ధ దేవస్థానం సిద్దులగుట్ట ఆర్మూర్ వద్దగల తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రెండవ పిరమిడ్ ధ్యాన మందిరం శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం లో

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం అత్యంత ఘనంగా ధ్యాన జ్ఞాన కార్యక్రమం మరియు ధ్యాన బతుకమ్మ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమానికి ఆత్మీయ జ్ఞానదాతగా వనపర్తి నుండి శ్రీ పాండురంగయ్య గారు విచ్చేసి అద్భుతమైన ధ్యాన గీతాలను ఆలపించి కార్యక్రమం లో పాల్గొన్న వారింది మూడు గంటల అఖండ ధ్యానాన్ని చేయించారు.

మానవ జీవితంలో ధ్యాన ఆవశ్యకతను శాకాహార ఆవశ్యకతను ఈ సందర్భంగా అత్యద్భుతంగా వివరించారు. ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమానికి విచ్చేసిన ధ్యాన బంధువులకు పిరమిడ్ మాస్టర్ విజయలక్ష్మి ఆర్మూర్ వారి కుటుంబ సభ్యులు 300 మందికి పైగా వచ్చిన ధ్యాన బంధువులకు ధ్యానామృతాన్ని అందించారు.

ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎమ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి మాస్టర్ సంజయ్, ప్రధాన సలహాదారులు బొడ్డు దయానంద్,మామిడి లక్ష్మారెడ్డి డాక్టర్ శ్రీనివాస్, పోలీస్ గంగారెడ్డి, సబ్బాని సుదర్శన్ మల్లేష్, సాయిబాబా, ఆర్మూర్ రాజు మైలారం రాజు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ టేకు కలప రవాణా కేసులో ట్రాక్టర్, ట్రాలీ స్వాధీనం

**ప్రధాన నిందితుడు బాదావత్ నరేష్ అరెస్టు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనంన్యూస్): అక్రమంగా టేకు కలప నిల్వ ఉంచిన కేసులో అటవీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో భాగంగా ట్రాక్టర్, ట్రాలీని స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సిరికొండ రేంజ్ అటవీ అధికారి కె. నర్సింగరావు తెలిపారు.

ఈ నెల 10న సిరికొండ మండలం దుప్య తండాకు చెందిన మాలావత్ తిరుపతి తండ్రి మంగ్య నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 23 టేకు కలప దుంగలను అటవీ అధికారులు గుర్తించారు. ఈ కలప విలువ రూ.89,683గా అంచనా వేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విచారణలో భాగంగా గురువారం సిరికొండ మండలం పాకాల గ్రామానికి చెందిన మాలావత్ నీలా భర్త మోహన్కు చెందిన ట్రాక్టర్ను గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న పాకాల గ్రామానికి చెందిన బాదావత్ నరేష్ తండ్రి రాజును అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం ట్రాక్టర్తో పాటు ట్రాలీని స్వాధీనం చేసుకుని కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అటవీ అధికారి కె. నర్సింగరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు

## బీబీపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

బీబీపేట,అక్టోబర్ 15 (మనం న్యూస్); శాంతి భద్రత కోసం పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేసుకోవాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. ఈ మేరకు బీబీపేట పోలీస్ స్టేషన్ ను గురువారం ఆయన తనిఖీ చేయడం జరిగింది. గ్రామాలలో దొంగతనాలు, నివారణకు రాత్రి వేళలో




పకడ్బందీగా గస్తీ నిర్వహించాలని సూచించారు. పండగ వేళ అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వారి పై నిఘా ఉంచాలని సూచించారు.112 అత్యవసర కాల్స్ వెంటనే స్పందించి బాధితులకు సహాయం అందించాలని అన్నారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ నవీన్ చంద్ర, సిబ్బంది ఉన్నారు.

# కళ్యాపూర్ అభివృద్ధికి మరో ముందడుగు

**నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన సర్పంచ్ రెమ్మ భాను చందర్...**

**మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సహకారంతో భవన నిర్మాణానికి మంజూరు..**

**40 ఏళ్ల నాటి భవనానికి బదులుగా నూతన భవనం...**



రెంజల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని కళ్యాపూర్ గ్రామ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. గ్రామ ప్రజలకు మెరుగైన పంచాయతీ సేవలు అందించాలనే లక్ష్యంతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గురువారం గ్రామ సర్పంచ్ రెమ్మ భాను చందర్ భూమిపూజ నిర్వహించారు. సుమారు నలభై (40 ) సంవత్సరాల నాటి పాత గ్రామపంచాయతీ భవనం ఉండడం వలన నూతన భవన నిర్మాణం చేపట్టనుండటంతో గ్రామ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**సుదర్శన్ రెడ్డి సహకారంతో నూతన భవనానికి మంజూరు**

ఈ సందర్భంగా సర్పంచ్ రెమ్మ భాను చందర్ మాట్లాడుతూ.. కళ్యాపూర్ గ్రామంలో సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ఉండటంతో, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, భవన నిర్మాణానికి సహకరించిన సుదర్శన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**సర్పంచ్గా భవన నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది.**

గ్రామ సర్పంచ్గా బాధ్యతలు చేపట్టిన సమయంలోనే గ్రామానికి అవసరమైన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందని రెమ్మ భాను చందర్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంతో పాటు, గ్రామపంచాయతీ కార్యకలాపాలకు నూతన భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు.

**గ్రామ అభివృద్ధికి అందరి సహకారం అవసరం.,**

నవరాత్రుల సందర్భంగా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడం ఆనందంగా ఉందని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలందరి సమిష్టి సహకారంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కళ్యాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ జరగడంతో గ్రామానికి మరో అభివృద్ధి కార్యక్రమం అందుబాటులోకి రానుంది. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని సర్పంచ్ రెమ్మ భాను చందర్ తెలిపారు...

# పిప్రి రైతు వేదికలో మహిళా కిసాన్ దివస్



### మహిళా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన

ఆర్మూర్, అక్టోబర్ 15(మనం న్యూస్): ఆర్మూర్ మండలం, పిప్రి గ్రామం లో మహిళా కిసాన్ దివస్ సందర్భంగా వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో పిప్రి రైతు వేదికలో మహిళా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, ఎర్రజొన్న సాగు ఒప్పందాలు, ఎల్నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ఏ.డి.ఏ. విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళా రైతుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విత్తనాలు నాటడం నుంచి కలుపు తీయడం, పంటల సంరక్షణ, కోతలు, పంట అనంతర నిర్వహణ వరకు మహిళలు విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు.

ఏ.ఓ. హరికృష్ణ మాట్లాడుతూ ఎర్రజొన్న సాగు చేసే రైతులు పంట కొనుగోలుకు సంబంధించి డీలర్లతో ఒప్పందాలు చేసుకునే ముందు నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. సాగు విస్తీర్ణం, నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు ధర, చెల్లింపుల విధానం వంటి అంశాలపై స్పష్టత ఉండాలన్నారు. ఎల్నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల కంది, జొన్న, సజ్జ, పెసర, మినుము వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. అనంతరం మహిళా రైతులు శారద, గంగమణిలను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.



ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండెల కిరణ్, ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఏ.డి.ఏ. విజయలక్ష్మి, ఏ.ఓ. హరికృష్ణ, ఏ.ఈ.ఓ.లు నిషికాంత్, రమ్య, గంగాజల, ఆత్మ బి.టి.ఎం. అనూష, ఏపీఎం భూమేష్, మహిళా రైతులు పాల్గొన్నారు.



# ఇంటి నిర్మాణం కూల్చివేతపై విడిసిపై చర్యలు తీసుకోవాలి

### న్యాయం చేయాలని బాధితుడు సురకంటి నితిన్ రెడ్డి విజ్ఞప్తి

ఆర్మూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్): ఆర్మూర్ నియోజకవర్గం,నందిపేట్ మండల కేంద్రంలో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన గ్రామాభివృద్ధి కమిటీ (విడిసి) సభ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సురకంటి నితిన్ రెడ్డి అధికారులను కోరారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలోని సర్వే నంబర్ 666/2లో ఉన్న 355 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నామని నితిన్ రెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారం సెట్బ్యాక్లు వదిలి 180 గజాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇంటి వెనుకవైపు బఫర్ జోన్ ఉండటంతో ఆ ప్రాంతాన్ని వదిలేసి నిర్మాణ పనులు చేస్తున్నామని వివరించారు.అయితే, ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇంటి వెనుక భాగంలో చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారని ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.సంబంధిత అధికారులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఇంటి నిర్మాణం కూల్చివేతకు గల కారణాలను పరిశీలించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు సురకంటి నితిన్ రెడ్డి కోరారు. తమకు న్యాయం జరిగేలా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# దసరా సందర్భంగా పారిశుధ్య కార్మికులకు కానుకలు

### నీలా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దుస్తులు, షూస్, గ్లౌజులు, నిత్యావసర సరుకుల పంపిణీ...

### గ్రామ పరిశుభ్రతకు నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలకు గుర్తింపు.. సర్పంచ్ క్యాతం యోగేష్ అభినందనలు...



రెంజల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): దసరా పండుగను పురస్కరించుకుని గురువారం నీలా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ పారిశుధ్య కార్మికులకు దుస్తులు, షూస్, గ్లౌజులతో పాటు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారిని అభినందిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేళ కార్మికులకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారిలో ఆనందాన్ని నింపారు.

### గ్రామ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

గ్రామంలో పరిసరాల పరిశుభ్రతను కాపాడుతూ, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతిరోజూ గ్రామంలోని వీధులు, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఎండా, వాన అనే తేడా లేకుండా తమ విధులను నిర్వర్తిస్తూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న కార్మికుల సేవలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

### కార్మికులకు దసరా కానుకలు పంపిణీ

దసరా పండుగను పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు రెండు జతల దుస్తులు, షూస్, గ్లౌజులతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. విధి నిర్వహణలో కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో వారికి అవసరమైన రక్షణ సామగ్రిని అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే కార్మికులను గౌరవించడం, వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడం సంతోషకరమైన విషయమని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

### కార్మికులకు దసరా శుభాకాంక్షలు

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్తో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పారిశుధ్య కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ముఖ్యమని, పారిశుధ్య కార్మికుల సేవలు గ్రామానికి గుర్తింపు తీసుకొస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్తో పాటు ఉపసర్పంచ్ సుభద్ర, వార్డు సభ్యులు సద్దాం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...



# బాధిత కుటుంబాన్నీ పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్

బీబీపేట, అక్టోబర్ 15(మనం న్యూస్): బీబీపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుల దేవునిపల్లి శ్రీనివాస్, దేవునిపల్లి దేవరాజు తండ్రి దేవునిపల్లి రాజమల్లయ్య అనారోగ్యం కారణంగా మరణించడంతో గురువారం మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీపీ పసులాది బాలమని,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏనగండ్ల రవి,నాయకులు శివ రాజయ్య, కుర్ల వెంకటేశం, రజిని కాంత్, ఆది రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో ఆరుతడి పంటలే వేసుకోవాలి

**డి ఏ ఓ మోహన్ రెడ్డి....**

బిచ్కుంద అక్టోబర్ 15 (మనం న్యూస్): కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలోని రైతు వేదికలో కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్లో

ఎల్ నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తక్కువ ఉండడం వలన రైతులు సన్ఫ్లవర్,కుసుమ, పెసర, జొన్న వంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.

బిచ్కుంద రైతు వేదికలో జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా క్షేత్ర దినోత్సవం జరపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.






డి ఏ ఓ మాట్లాడుతూ ఈ సంవత్సరం వాన కాలంలో జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో మద్నూర్, బిచ్కుంద మండలాలలో రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా రైతులకు రాయితీపై సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాలు పొందిన రైతు యొక్క క్షేత్ర సందర్శన చేసి పంట దిగుబడి వివరాలు తెలుసుకోవడం జరిగింది. శ్రీమతి కార్తిక సంతోష్,శ్రీమతి శ్యామల గంగాధర్ బిచ్కుంద కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేయడం, ఆ విత్తనాల ద్వారా రైతులు మంచి దిగుబడులు పొందడం సంతోషకరమని తెలియజేశారు. రానున్న యాసంగిలో ఎల్నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి ఆరుతడి పంటలు మాత్రమే పండించాలని రైతులను కోరారు. జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా యాసంగి కి గాను రాయితీపై వచ్చిన పొద్దు తిరుగుడు పంట విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ పథకంలో యాసంగి కాలానికి 12.5 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు విత్తనం రాయితీపై రైతులకు అందజేయబడును.

జాతీయ మహిళా కిసాన్ దివాస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయంలో మహిళా రైతుల యొక్క పాత్ర వారి ప్రాముఖ్యతను మహిళా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్చించడం జరిగింది. మహిళా అధికారులను జిల్లా వ్యవసాయ అధికారి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిచ్కుంద సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి కమల, రైతు సంఘం అధ్యక్షులు శంకర్, మద్నూర్ రైతు సంఘం అధ్యక్షులు గోపాల్, మండల వ్యవసాయ అధికారులు అమర్ ప్రసాద్, రాజు, టెక్నికల్ వ్యవసాయ అధికారి సంతోష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

---

# నయాబాద్ కాలనీలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల పూల బతుకమ్మలతో మహిళలు, చిన్నారుల సందడి..**

**ఆటపాటలతో మార్మోగిన కాలనీ!**



రెంజల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): రెంజల్ మండల కేంద్రంలోని నయాబాద్ కాలనీలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో చేరి ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.

**పూల బతుకమ్మలతో కళకళలాడిన నయాబాద్ కాలనీ**

సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, అందంగా ముస్తాబైన చిన్నారులు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ లయబద్ధంగా ఆడిపాడారు. తంగేడు, గునుగు తదితర రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల కోలాటాలు, చిన్నారుల కేరింతలు, బతుకమ్మ పాటలతో కాలనీ మొత్తం సందడిగా మారింది.



**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తూ చిన్నారులు సైతం బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా నిలిచింది.

**మహిళల ఐక్యతకు, ఆత్మీయ అనుబంధాలకు వేదికగా బతుకమ్మ**

కులమతాలకు అతీతంగా మహిళలందరూ ఒకచోట చేరి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడంతో నయాబాద్ కాలనీలో పండుగ సందడి నెలకొంది. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు ఒకరినొకరు పలకరించుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పాటలు, ఆటలు, పూల అందాలతో నయాబాద్ కాలనీ బతుకమ్మ వేడుకలతో కళకళలాడింది.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం ఇలాగే ఘనంగా నిర్వహించుకోవాలని మహిళలు ఆకాంక్షించారు. ఆనందోత్సాహాల మధ్య సాగిన ఈ వేడుకలు కాలనీవాసుల్లో పండుగ ఉత్సాహాన్ని నింపాయి.

---



# పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?: గంప గోవర్ధన్

**- విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం విఫలమైంది: మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తీవ్ర విమర్శలు.**

**- ఎండిన పంటలకు వెంటనే పరిహారం చెల్లించాలి, గ్రామాల్లో 6-7 గంటలే విద్యుత్ సరఫరా!**

**- జనరేటర్లతో పంటలను కాపాడుకుంటున్న రైతులు, బొగ్గు తరలింపుపై ఆరోపణలు.**

కామారెడ్డి, అక్టోబరు 15(మనం న్యూస్): రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు గంప గోవర్ధన్ విమర్శించారు. ఎండిపోయిన పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు ఆరు నుంచి ఏడు గంటలే విద్యుత్ సరఫరా అవుతోందని, దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మాచారెడ్డి ప్రాంతంలో కొందరు రైతులు జనరేటర్లను వినియోగించి పంటలను కాపాడుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ సమస్యలపై రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**విద్యుత్ సరఫరాలో లోపాలకు ప్రభుత్వానికిదే బాధ్యత**

విద్యుత్ కోతలపై అధికారులను బెదిరించడం, సురేష్ అనే అధికారిని సస్పెండ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో వేల కోట్లు ఖర్చు చేసి గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేశారని గుర్తుచేశారు. అప్పటి అధికారులే ఇప్పుడు ఉన్నా కోతలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఎల్నినో ప్రభావం పేరుతో ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వాతావరణ పరిస్థితులపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7 వేల మెగావాట్ల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచామని గంప గోవర్ధన్ పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం కేసీఆర్ నిర్మించిన భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు.

**బొగ్గు తరలింపుపై ఆరోపణలు**

రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు రికార్డులు లేకుండా బయటకు వెళ్లిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అంతరాయాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతోపాటు, పంటలు ఎండిపోకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సింగరేణిని ప్రవేట్ పరం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు జూకంటి ప్రభాకరరెడ్డి, నాయకులు కుంబాల రవి, మీర్జా హఫీజ్ బేగ్, భాను ప్రసాద్, మామిండ్ల లక్ష్మణ్, గోపు నర్సింలు, కృష్ణాజిరావు, బల్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# న్యూరోసర్జరీలో సరికొత్త సాంకేతిక విప్లవం

**- మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సల్లో అధునాతన సాంకేతికత.**
**- యశోద హాస్పిటల్స్.. న్యూరోఎండోస్కోపీ, రోబోటిక్ విధానాలతో చికిత్సలు డా. కృష్ణ తేజ్ రెడ్డి.**




కామారెడ్డి, అక్టోబరు 15(మనం న్యూస్): మెదడు, వెన్నెముక సంబంధిత సంక్లిష్ట వ్యాధులకు అధునాతన సాంకేతికతతో కనిష్ట గాయంతో కూడిన శస్త్రచికిత్సా సేవలను అందిస్తున్నట్లు యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్లోని న్యూరోఎండోస్కోపీ, రోబోటిక్ న్యూరోసర్జరీ కేంద్రం వెల్లడించింది. న్యూరోఎండోస్కోపీ, రోబోటిక్ సాయంతో చేసే శస్త్రచికిత్సలు, ఆధునిక ఇమేజింగ్ సదుపాయాలను సమన్వయం చేస్తూ రోగుల అవసరాలకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. డా. కృష్ణ తేజ్ రెడ్డి ఈ కేంద్రంలో న్యూరోసర్జరీ సేవలు అందిస్తున్నారు.

### మెదడు కణితుల తొలగింపు

మెదడు కణితుల చికిత్సలో శస్త్రచికిత్స సమయంలోనే ఎంఆర్ఐ చిత్రాలను తీసే ఇంట్రాఆపరేటివ్ ఎంఆర్ఐ సదుపాయం కీలకంగా ఉపయోగపడుతుంది. కణితి తొలగింపు స్థాయిని అంచనా వేస్తూ, కీలకమైన మెదడు భాగాలకు నష్టం కలగకుండా అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది తోడ్పడుతుంది.

### మూర్ఛ, బ్రెయిన్ స్ట్రోక్

మందులు వాడినా నియంత్రణలోకి రాని మూర్ఛకు రోగి పరిస్థితిని బట్టి శస్త్రచికిత్సా చికిత్సలను అందిస్తున్నారు. మెదడులో రక్తస్రావం జరిగే కొన్ని సందర్భాల్లో ఎండోస్కోపిక్ విధానంలో రక్తపు గడ్డను తొలగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. ట్రైజెమినల్ న్యూరల్జియా కారణంగా తీవ్రమైన ముఖనొప్పితో బాధపడేవారికి ఎండోస్కోపిక్ మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ విభాగంలో ఇప్పటివరకు 110 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు కేంద్రం తెలిపింది. బాధితుల్లో అవగాహన పెంచేందుకు అక్టోబరు 7న ప్రత్యేక క్లినిక్, అవగాహన బృందాన్ని ప్రారంభించింది.

### వెన్నెముక సమస్యలు

వెన్నెముక సమస్యలకు ఎండోస్కోపిక్, కనిష్ట గాయంతో కూడిన శస్త్రచికిత్సలు, ఎంపిక చేసిన కేసుల్లో డే కేర్ విధానాలను అందిస్తున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రత ఆధారంగా చికిత్సను నిర్ణయిస్తూ, ఆసుపత్రిలో ఉండే సమయాన్ని తగ్గించి త్వరగా సాధారణ కార్యకలాపాలకు తిరిగి వచ్చేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం పేర్కొంది.

### ఐదు రోజుల శిశువుకు మెదడు శస్త్రచికిత్స

పుట్టి ఐదు రోజులే అయిన నవజాత శిశువుకు మెదడులో తీవ్రమైన రక్తస్రావం కావడంతో.. అత్యాధునిక వైద్య సాంకేతికతతో శస్త్రచికిత్స నిర్వహించి వైద్యులు ప్రాణాలు కాపాడారు. ప్రసవ సమయంలో తీవ్ర గాయానికి గురైన చిన్నారిని వరంగల్ నుంచి వెంటిలేటర్ సహాయంతో సికింద్రాబాద్లోని యశోద ఆసుపత్రికి తరలించారు. పరిస్థితిని వేగంగా అంచనా వేసిన న్యూరోసర్జరీ బృందం.. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం మెరుగుపడటంతో సాధారణంగా పాలు తాగుతూ కోలుకుంటోంది.



### నావిగేషన్, న్యూరోఎండోస్కోపీతో శస్త్రచికిత్స

ప్రసవ సమయంలో గాయాల కారణంగా శిశువు మెదడులో అధికంగా రక్తస్రావం కావడంతో అత్యవసర వైద్యసేవలు అవసరమయ్యాయి. దీంతో చిన్నారిని వెంటిలేటర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య బృందం పరీక్షలు నిర్వహించి పరిస్థితిని అంచనా వేసిన అనంతరం, మెదడులో పేరుకుపోయిన రక్తాన్ని తొలగించాలని నిర్ణయించింది. ఆధునిక నావిగేషన్ సాంకేతికత, న్యూరోఎండోస్కోపీ సహాయంతో శస్త్రచికిత్స చేపట్టి రక్తాన్ని తొలగించారు.

### అనస్థీషియా నిర్వహణ కీలకం

ఐదు రోజుల వయస్సున్న శిశువుకు మత్తుమందు ఇవ్వడం వైద్యపరంగా అత్యంత సున్నితమైన ప్రక్రియ. శ్వాసనాళం పరిమాణం, శరీర ఉష్ణోగ్రత, రక్తంలో చక్కెర స్థాయిలు, రక్తనష్టం, మెదడు పనితీరును నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. చిన్నపాటి మార్పులనూ వెంటనే గుర్తించి స్పందించేలా వైద్యులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారు. ఈ క్రమంలో శిశువు ఆరోగ్య పరిస్థితిని స్థిరంగా ఉంచుతూ శస్త్రచికిత్సను పూర్తి చేశారు.

# సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఎంపిక

**జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి.. విద్యార్థులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ ఆర్. నర్సయ్య**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): క్రీడారంగంలో సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. హనుమకొండ జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎల్.బి. కళాశాల క్రీడా ప్రాంగణంలో అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్న 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-13 మినీ సబ్ జూనియర్ అంతర్జిల్లా సాఫ్ట్బాల్ ఛాంపియన్షిప్ 2026-27 బాలుర విభాగం పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఆర్. నరేంద్ర, జి. శరత్ చంద్ర, కె. సాయి సృజన్, టి. రిత్విక్, బి. శ్రీరామ్ ఈ నెల 4న జక్రాన్పల్లి మండలం తొర్లికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్. నర్సయ్య విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో ఆడుతూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.

జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ కూడా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అనికేత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు నేడు ప్రత్యేక డ్రైవ్

**ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులకు అవకాశం**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): ఓటరు జాబితాలో కొత్తగా పేర్ల నమోదు చేసుకోవడంతో పాటు, జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం నేడు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్లో భాగంగా ఫామ్-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు, ఫామ్-7 ద్వారా ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు, ఫామ్-8 ద్వారా ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అర్హులైన పౌరులు అవసరమైన ధ్రువపత్రాలతో తమ పోలింగ్ బూత్ పరిధిలోని బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)ను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సిరికొండ తహసిల్దార్ ఆర్ రవీందర్ రావు సూచించారు. ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు చేసుకోవాలని కోరారు.

## సమాచార కమిషనర్ ఆదేశాలను పాటించని జెఎన్టియుపిఐవోపై పిర్యాదు





బోధన్ అక్టోబర్ 15 ( మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను పాటించని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ పౌర సమాచార అధికారి పై రాష్ట్ర సమాచార కమిషనర్ కు పిర్యాదు చేసిన సహ చట్టం కార్యకర్త మీర్జాపురం రామకృష్ణ వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం కు చెందిన సహ చట్టం కార్యకర్త మీర్జాపురం రామకృష్ణ రెండు వేల ఇరువై నాలుగు సంవత్సరం లో జె ఎన్ టి యు పౌర సమాచార అధికారి తనకు అసంతృప్తి సమాచారం పంపడం తో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కు రెండో అప్పీల్ చేసుకున్నాడు దరఖాస్తులను పరిశీలించిన కమిషన్ ఈ సంవత్సరం ఇరువై తొమ్మిది తేదీ జూలై న విచారణ కు రావాలని ధరకాస్తు దారు నికి జె ఎన్ టి యు పి ఐ వో కు మొదటి అప్పీలేట్ అథారిటీ అధికారి లకు నోటీసులు జారీ చేసింది పి ఐ వో కమిషన్ కు హాజరైనారు మొదటి అప్పెలేట్ గైర్హాజరు అయినారు కమిషనర్ వైష్ణవి మెర్ల కేసు విచారణ చేసి రెండు వారాలలోగా ధరకాస్తు దారునికి తను అడిగిన సమాచారం ఇవ్వాలని అదేశాలు జారీ చేసింది రెండు నెలలు గడిచిన తనకు జె ఎన్ టి యు పి ఐ వో సమాచార పంపకపోవడం తో సమాచార కమిషన్ కు పిర్యాదు చేసినట్లు రామ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

# సహకార సంఘాల పీఠాలపై ఉత్కంఠ!

**సిరికొండ, తూంపల్లి సొసైటీలకు కొత్త అధ్యక్షులు ఎప్పుడు?**

**నిజామాబాద్ జిల్లాలో నామినేటెడ్ పాలకవర్గాల కోసం ఎదురుచూపులు..**

**మంత్రివర్గం ఆమోదంపై ఆశలు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): రైతుల ఆర్థిక ప్రగతికి దోహదపడే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల నియామకాలపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సహకార సంఘాల నామినేటెడ్ పాలకవర్గాలు కొలువుదీరుతున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో మాత్రం ఇప్పటివరకు నియామకాలు జరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా సిరికొండ మండలంలోని సిరికొండ, తూంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు కొత్త అధ్యక్షులు ఎప్పుడు నియమితులవుతారన్న ఆసక్తి స్థానికంగా వ్యక్తమవుతోంది.

**గడువు ముగిసినా.. కొనసాగుతున్న ఎదురుచూపులు!**

సిరికొండ మండల పరిధిలో సిరికొండ, తూంపల్లి పేర్లతో రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో గతంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో పాత పాలకవర్గాలు తిరిగి బాధ్యతలు చేపట్టింది. దీంతో సహకార సంఘాల పాలన, తదుపరి నియామకాలపై ఆసక్తి నెలకొంది.

**ఎన్నికలు కాదు.. నామినేటెడ్ విధానాల నియామకాలపై చర్చ!**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సహకార సంఘాల పాలకవర్గాలను ఎన్నికల ద్వారా కాకుండా నామినేటెడ్ విధానంలో నియమించే దిశగా చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో కొన్ని జిల్లాల్లో ఇప్పటికే పాలకవర్గాలు ఏర్పాటైనట్లు తెలుస్తోంది. అయితే నిజామాబాద్ జిల్లాలో మాత్రం ఇప్పటివరకు ఒక్క సహకార సంఘానికి కూడా కొత్త పాలకవర్గాన్ని ప్రకటించకపోవడంతో ఆశావహులు, స్థానిక నాయకులు ఎదురుచూస్తున్నారు.

**అధ్యక్షుల పేర్లు ఖరారయ్యాయా?**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం నిజామాబాద్ జిల్లాలోని సహకార సంఘాలకు అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కొంతవరకు పూర్తయినట్లు, సిరికొండ, తూంపల్లి సొసైటీల అధ్యక్షుల పేర్లను కూడా ఖరారు చేసి మంత్రివర్గం ఆమోదానికి పంపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నియామకాలపై ఉత్కంఠ మరింత పెరిగింది.

**దసరా కానుకగా నియామకాల ప్రకటన ఉంటుందా?**

దసరా పండుగకు ముందురోజు లేదా పండుగ అనంతరం సహకార సంఘాల నామినేటెడ్ పాలకవర్గాల నియామకాలపై ప్రభుత్వం నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే నియామకాల తేదీ, అధ్యక్షుల పేర్లపై ప్రభుత్వం నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

**రైతులకు మరింత చేరువగా సహకార సంఘాలు ఉండాలనే ఆకాంక్ష**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు పంట రుణాలు, ఎరువుల సరఫరా, ఇతర వ్యవసాయ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో సమర్థవంతమైన పాలకవర్గాలు ఏర్పాటై రైతుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక రైతులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

మొత్తానికి, సిరికొండ, తూంపల్లి సహకార సంఘాలకు కొత్త అధ్యక్షులు ఎవరవుతారు? నామినేటెడ్ పాలకవర్గాల నియామకాలపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? అన్న ప్రశ్నలకు అధికారిక ప్రకటనతోనే స్పష్టత రానుంది. అప్పటివరకు సహకార సంఘాల పీఠాలపై ఉత్కంఠ కొనసాగనుంది.

## పి డి యస్ యు జిల్లా అధ్యక్షులు ఆర్ గౌతమ్ కుమార్ అక్రమ అరెస్టును ఖండించండి

**ఎ ఐ కె యం యస్ బోధన్ డివిజన్ కార్యదర్శి సూర్య విఠల్**



బోధన్ అక్టోబర్ 15 ( మనం న్యూస్): భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, యస్ ఆర్ ను రద్దు చేయాలని, అక్రమంగా తొలగించి న ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ లో నీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా చేపట్టిన పి డి యస్ యు, పి వై యల్ నాయకులను నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్ ₹గౌతమ్ కుమార్₹ ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘా బోధన్ డివిజన్ కార్యదర్శి సూర్య విఠల్ ఖండించారు దేశంలో ఢిల్లీ కేంద్రంగా రాహుల్ గాంధీ నిరసన వ్యక్తపరుస్తూ ర్యాలీలు ధర్నాలు చేస్తారు అదే డిమాండ్ పై తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నిరసన కార్యక్రమం చేపట్టిన నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడానికి వారు తప్పు పట్టారు అరెస్టు చేసిన నాయకులను భేషరత్ గా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు అలాగే ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ,ఆయన పై స్వతంత్ర న్యాయ విచారణ చేపట్టాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



## భీంగల్లో మహిళల కోలాహలం మధ్య ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

భీమ్గల్ ,అక్టోబర్ 15 ( మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు భీంగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు.




ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకలకు హాజరయ్యారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో మహిళల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పూల పండుగైన బతుకమ్మ ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో మహిళలు కీలక పాత్ర పోషించారు. కుటుంబ సభ్యులతో పాటు తోటి మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. మహిళల సామూహిక భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగాయి.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, ఎమ్మార్వో, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ మరియు మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే సద్దుల బతుకమ్మ వేడుకలను భీంగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం పట్ల పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**రూ.5 వేల జరిమానా విధించిన ఫాస్ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 (మనం న్యూస్): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు కాలే పండురంగాకు గౌరవ ఫాస్ట్రాక్ ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి దుర్గాప్రసాద్ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

కేసు వివరాలు: 2021 మార్చి 18న బాధిత బాలిక తల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కేసుకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను న్యాయస్థానంలో సమర్పించారు. విచారణలో భాగంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష విధించింది.

**న్యాయస్థానం విధించిన శిక్షలు:**

భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 376ఏబీ కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష.

పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎం)తో పాటు సెక్షన్ 6 కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా.

మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొంటూ, బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.